క్లుప్తంగా

సోంపురంలో నేత్రవైద్య శిబిరం



నేత్ర పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ ఈశ్వరరావు

వేపాడ: మండలంలోని సోంపురంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా బొద్దాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ సీహెచ్ ఈశ్వరరావు 32 మంది వృద్ధులకు నేత్ర పరీక్షలు చేసి అయిదుగురిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. సర్పంచ్ గంగరాజు, గ్రామ పెద్దలు ఉగ్గిన శ్రీను, గణపతి ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్వోబీ నిర్మాణానికి సన్నాహాలు

● రూ.12.97 కోట్లతో టెండర్లు పూర్తి



ఆర్వోబీ నిర్మాణానికి చదును చేసిన స్థలం

చీపురుపల్లి: స్థానిక రైల్వేస్టేషన్‌లో సమీపంలోని రాజాం రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణ పనులు ప్రారంభానికి రైల్వే యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఆర్వోబీ నిర్మించాల్సిన స్థలంలో ఇప్పటికే భూ పరీక్షలు పూర్తి చేసి, భూమిని చదును పనులు చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కృషితో ఇప్పటికే ఆర్వోబీ నిర్మాణానికి రూ.12.97 కోట్లు నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ పూర్తికావడంతో సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులకు త్వరలో శంకుస్థాపన చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఆర్వోబీ దశాబ్దాల క్రితం నిర్మించినది కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆర్వోబీపై నుంచి భారీ వాహన రాకపోకలను రైల్వే అధికారులు కొద్ది కాలం క్రితమే నిషేధించారు.

సత్తాచాటిన కేజీబీవీ విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న ఎస్‌ఓ జ్యోతి

జామి: ప్రకాశం జిల్లా దొనకొండలో గతనెల 28,29,30వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–14 హ్యాండ్‌బాల్ పోటీల్లో కుమరాం కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) విద్యార్థినులు సత్తా చాటారని కేజీబీవీ ఎస్‌ఓ బి.జ్యోతి తెలిపారు. పాఠశాల 10వతరగతి విద్యార్థినులు ఎం.గాయత్రి, జి.హర్షిత జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించి ద్వితీయ స్థానంలో నిలిచారని చెప్పారు.విద్యార్థినులను ఎస్‌ఓతో పాటు పీఈటీ కొండమ్మ తదితరులు గురువారం అభినందించారు.

అల్లూరి విగ్రహావిష్కరణ



అల్లూరి విగ్రహావిష్కరణలో గ్రామ పెద్దలు

దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రాపురంలో క్షత్రియులు ఏర్పాటు చేసిన మన్యం విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని స్థానికుడు పేరిశర్ల శివరామరాజు గ్రామపెద్దలతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ దేశ స్వాతంత్రోద్యమంలో తన వీరోచిత పోరాటంతో బ్రిటీష్ వాళ్లను ఎదురించి మన్యం వీరుడిగా పేరొందిన అల్లూరి సీతారామరాజు ప్రజల గుండెల్లో సదా చిరస్మరణీయుడని అన్నారు.

మునగ మొక్కల పంపిణీ



మునగమొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సోమేశ్వరరావు, తదితరులు

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో గౌరీపురం గ్రామంలో వెలుగు ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఎంపీపీ సోమేశ్వరరావు గురువారం పదివేల మునగ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరటిలో, కళ్లాల వద్ద, పొలం గట్లపై మునగ మొక్కలు సాగు చేయడం వల్ల రైతులు అదనపు ఆదాయాన్ని సాధించవచ్చని చెప్పారు. మునగ ఆకు, కాడలు వినియోగంతో ఆరోగ్యం చేకూరుతుందన్నారు. వైస్ ఎంపీపీ సుధారాజు, సర్పంచ్‌లు సుంకరి ఈశ్వరరావు, జి.సంతోషికుమారి వెలుగు ఏపీఓ, ఐ.రామరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి,సంక్షేమాన్ని ప్రజలకు వివరించండి

● ప్రభుత్వంపై ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం
● కష్టపడి పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు
● గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

గంట్యాడ: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మండల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్ వద్ద సచివాలయ కన్వీనర్లు, గృహసారథు లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి అధిష్ఠానం తగిన గుర్తింపు ఇస్తుందని చెప్పారు. గత ఎన్నికలకు ముందు పార్టీ తరఫున గ్రామాల్లో బూత్ కమిటీలను నియమించామని, ఈసారి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లను నియమించుకున్నామని చెప్పారు. పార్టీ కార్యక్రమాల్లో మహిళలను భాగస్వాములను చేయాలని తెలిపారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి, ప్రభుత్వంపై టీడీపీ తన అనుకూల ఎల్లో మీడియా ద్వారా బురద జల్లే ప్రయత్నం చేస్తోందని, వారి దుష్ప్రచారాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అర్హులందరికీ జగనన్న అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన, వైఎస్సార్ చేయూత, జగనన్న చేదోడు, వైఎస్సార్ రైతుభరోసా, వాహన మిత్ర తదితర పథకాలను అందిస్తున్నామని, అలాగే ఇళ్లస్థలాలు, ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. నాడు–నేడుతో పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నామని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలన్నీ ప్రజలకు గ్రామాల్లోనే అందుతున్నాయని, సామాజిక పింఛన్లను వలంటీర్ల ద్వారా ప్రతీ నెల ఒకటో తేదీ ఉదయాన్నే తలుపుతట్టి అందిస్తున్నామని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమం అమలువుతోందని, ఇదంతా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందిపై ఉందని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు పంచాయతీకి ఒకరిద్దరికి ఇస్త్రీ పెట్టెలు,గొర్రె పిల్లలు ఇచ్చి బీసీలను తామే అభివృద్ధి చేశామని ప్రచారం చేసుకున్నాడని, కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీలు శాశ్వతంగా అభివృద్ధి చెందేలా చర్యలు చేపడుతున్నారని చెప్పారు. 2024 ఎన్నికల్లో పార్టీ మళ్లీ విజయం సాధించేలా అంతా కృషి చేయాలని కోరారు. ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల మండల కన్వీనర్ రామసూర్యం, పార్టీ సీనియర్ నాయకులు నారాయణమూర్తి, లచ్చిరెడ్డి కృష్ణ, పి.నారాయణమూర్తి, రంధి రాము, రంభ సత్యారావు, కోడెల ముత్యాలనాయుడు, కిలపర్తి అప్పలనాయుడు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇంటింటికీ సంక్షేమం



సభలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

● 'గడప గడపకు మన ప్రభుత్వం'లో జెడ్పీ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు

మెరకముడిదాం: అర్హతే ప్రామాణికంగా, పార్టీలకతీతంగా ఇంటింటికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బిళ్లవలస గ్రామంలో గురువారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ముందుగా గ్రామంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణాల మాఫీకి సంబంధించిన నిధులను విడతల వారీగా మహిళల ఖాతాల్లో జమ చేస్తు న్నారని, ఇప్పటికే రెండు విడతలు జమ చేశారని, మూడో విడత మరికొద్దిరోజుల్లో వేయనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, అమ్మఒడి, జగనన్న చేదోడు రైతు భరోసా తదితర పథకాల ద్వారా బిళ్లలవలస గ్రామంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.5.74 కోట్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ మూడున్నరేళ్లలో జమ చేసిందని చెప్పారు. ఇన్ని కోట్ల రూపాయలను ఒక్క రూపాయి కూడా అవినీతికి తావులేకుండా ప్రజలకు అందజేశామని అన్నారు. గ్రామంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను నాడు–నేడు పథకంలో భాగంగా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దామని, 8వ తరగతి విద్యార్థులకు ఎడ్యుటెక్ కంపెనీ బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందజేశామని చెప్పారు. ఈ ప్రాంతంలో విద్యుత్ లోఓల్టేజ్ సమస్యను పరిష్క రించేందుకు వెదుళ్లవలసలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పలవలస సచివాలయం పరిధిలో ఇప్పలవలస, బిళ్లలవలస రెండు గ్రామాల్లో కోటి రూపాయలతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. బిళ్లలవలసలో 34 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేశామని వివరించారు. అనంతరం ప్రజాప్రతనిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను జెడ్పీ చైర్మన్ ఆరా తీశారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, ఎంపీపీ తాడ్డి కృష్ణ వేణి, స్థానిక సర్పంచ్ టి.పాపయ్యమ్మ, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కోట్ల మోతీలాల్‌నాయుడు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, టి.వర్మరాజు, కొర్లాం ఎంపీటీసీ జంపన సావిత్రమ్మ, ఎంపీడీఓ పి.రామకృష్ణ పాల్గొన్నారు.

9,933 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

వేపాడ: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలో రైతుల నుంచి ఇప్పటి వరకు 9,933 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని ఏఓ సి.బి.యశ్వంతరావు తెలిపారు. మండ ల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 16,571 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా అధికారులు లక్ష్యం విధించారని చెప్పారు. అయితే 16,571 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉండగా రైతాంగం వారి అవసరాలకు 4,939 టన్నుల ధాన్యం ఉంచుకున్నారని, మిగిలిన 11,632 టన్నుల్లో 8,132 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. జిల్లాకు సంబంధించి నిర్దేశించని టార్గెట్ సంక్రాంతి నాటికి పూర్తి కావడంతో మండలంలో 3,500 టన్నుల ధాన్యం ఇంకా రైతుల వద్ద ఉండిపోయాయని, తాజాగా ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో మళ్లీ కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. కల్లాల్లో ఉన్న ధాన్యం నిల్వలు, రైతుల ఫొటోలతో జియోట్యాగింగ్ చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, తాజాగా మరో 1801 మెట్రిక్ టన్నులు సేకరించామని స్పష్టం చేశారు. మిగిలిన 1,699 టన్నులు ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని చెప్పారు.

హౌసింగ్ ఏఈగా శ్రీనివాసరావు

దత్తిరాజేరు: మండల హౌసింగ్ ఏఈగా శ్రీనివాసరావు గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎస్.కోట నుంచి బదిలీపై ఇక్కడి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

నేడే ఉపసర్పంచ్‌ల ఎన్నిక

మెరకముడిదాం: మండలంలోని ఊటపల్లి, శ్యామాయవలస పంచాయతీలకు ఉపసర్పంచ్‌ల ఎన్నిక శుక్రవారం నిర్వహించనున్నారు. గతంలో ఈ పంచాయతీలకు ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా ఈనెల 3న ఎన్నికలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈఎన్నికలకు సంబంధించి ఆ పంచాయతీల సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు ఇప్పటికే సమాచారం ఇవ్వడంతో పాటు ఏర్పాట్లు చేశామని సంబంధిత అధికారులు చెప్పారు.

వీఆర్‌పై చర్యలు తీసుకోవాలి

దత్తిరాజేరు: మరడాం వీఆర్‌ఓ కొంత కాలంగా విధులకు డుమ్మా కొట్టడంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపించామని తహసీల్దార్ రమేష్ గురువారం విలేకరులకు తెలిపారు. వీఆర్‌ఓ విధులకు గైర్హాజరు కావడంతో పాటు భూహక్కు పత్రాల పంపిణీలో నిర్లక్ష్యం, మ్యుటేషన్లను పెండింగ్‌లో ఉంచుతున్నారని, ఆయన కు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదని చెప్పారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామని తెలిపారు.

తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం

వేపాడ: ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ పెట్టుబడితో పంటలను సాగు చేసి అధిక ఆదాయం సాధించవచ్చని సీఎస్‌ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఆనందరావు అన్నారు. మండలంలోని చినగుడిపాల, నీలకంఠరాజపురం గ్రామాల్లో కట్టిజనుమ, పెసర పంటలను గురువారం ఆయన పరిశీలించారు. సాగులో రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల ను వినియోగించాలని సూచించారు. ఎస్‌ఎఫ్‌ఎం మెర్సీ, వేపాడ వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు వేచలపు రామ్మూర్తినాయుడు, చినగుడి పాల సర్పంచ్ రామునాయుడు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సమన్వయంతో పని చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, వేదికపై ఎమ్మెల్సీ రఘురాజు తదితరులు

● ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయమే ధ్యేయంగా అంతా కలిసి పనిచేద్దామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎస్.కోట మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో గురువారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకే వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను నియమిస్తున్నామని, త్వరలో వీరికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ పార్టీని అధికారంలో ఉంచడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకుని, ప్రణాళిక ప్రకారం సమన్వయంతో పని చేద్దామన్నారు. ఎక్కడైనా నాయకుల మధ్య విభేదాలు, మనస్పర్థలు ఉంటే వాటిని వదిలి అంతా కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆశలకు తగ్గట్టుగా సీఎం జగన్ పనిచేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం పథకాలను అమలు చేసి తద్వారా మనకు గౌరవం పెంచిన సర్కారు ఇది అని అన్నారు. ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీలు పినిశెట్టి వెంకటరమణ, ఐ.సుధారాజు, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, వైస్ సర్పంచ్ మోపాడ కుమార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ రహ్మాన్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం

జామి: మండలంలో ఎస్.కోట నియోజకవర్గం పరిధిలోని గ్రామాలకు సంబంధించిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు జి.రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30కు మండల కేంద్రంలోని జె.ఎస్.ఆర్ కల్యాణమండపంలో నిర్వహించే ఈ సమావేశంలో జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొంటారని, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

గజపతినగరంలో...

గజపతినగరం: మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మండల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

4న బొండపల్లిలో..

బొండపల్లి: మండలంలోని గృహ సారథులు, సచివాలయ కన్వినర్లతో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన (శనివారం) సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్ల చలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ గురువారం తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న లేఅవుట్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీలు



పోటీల్లో పరుగు తీస్తున్న ఎద్దులు



విజేతలకు నగదుబహుమతులు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు తదితరులు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేటలో గ్రామదేవత పరదేశిమాంబ తీర్థవ సందర్భంగా గురువారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. ఈ పరుగు ప్రదర్శనలో 12 జతల ఎద్దులు పాల్గొన్నాయి. వీటిలో వల్లంపూడి సిద్ధివినాయక ఎద్దులు ప్రథమస్థానంలో నిలిచి రూ.12 వేలు, వావిలపాడు మరిడిమాంబ ఎద్దులు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.10వేలు, కలగాడకు చెందిన రామునాయుడు ఎద్దులు మూడో స్థానంలో నిలిచి రూ.8 వేలు నగదు బహుమతిని గెలుచుకున్నాయి. వరుసగా ఏడు స్థానాల్లో నిలిచిన ఎద్దులకు సంబంధించిన యజమానులకు డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, మాజీ సర్పంచ్ గుమ్మడి భారతి, వార్డు మెంబర్లు ఎం.రమణ, ముత్యాలునాయుడు గ్రామపెద్దలు నగదు బహుమతులు అందజేశారు. తీర్థం సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంక్షిప్తంగా...

పౌష్టికాహార కిట్ల పంపిణీ

గజపతినగరం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని పురిటిపెంట సర్పంచ్, వైస్ సర్పంచ్‌లు నరవ కొండమ్మ, మండల సురేష్ గర్భిణులు, బాలింతలకు సూచించారు. పురిటిపెంట అంగన్‌వాడీ కేంద్రం–2లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను గురువారం పంపిణీ చేశారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల, ఇన్‌చార్జి అంగన్‌వాడీ కార్యకర్త సుభాషిణి పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లపై దృష్టిసారించాలి

వేపాడ: గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఈఓపీఆర్డీ సూర్య నారాయణ అన్నారు. బల్లంకి గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశమై ఇంటి పన్నులు, సచివాలయంలో ఈ–సేవలు, వ్యాపార పన్నులు, ఆయుష్మాన్ భారత్ పథకానికి ఆధార్ అప్‌డేట్ తదితర అంశాలపై చర్చించారు.

ఆరోగ్య సూత్రాలపై అవగాహన

గజపతినగరం రూరల్: మండలంలోని మధుపాడ ఎస్సీ కాలనీ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై రాష్ట్రీయ బాల కిషోర్ స్వస్థ, మరుపల్లి పీహెచ్‌సీ సిబ్బంది లావణ్య, తదితరులు గురువారం అవగాహన కల్పించారు. మరుగుదొడ్డికి వెళ్లి వచ్చిన తర్వాత, భోజనానికి ముందు చేతులను బాగా శుభ్రం చేసుకోవాలని సూచించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వివరించారు.

లారీ ఢీకొని విద్యార్థికి గాయాలు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి కూడలి వద్ద జాతీయ రహదారిపై సైకిల్‌పై వెళుతున్న విద్యార్థి మరడ హరిప్రసాద్‌ను గురువారం వెనుక నుంచి లారీ ఢీకొనడంతో గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మరడాం ఉన్నత పాఠశాలలో చదువుతున్న హరిప్రసాద్ పాఠశాల నుంచి స్వగ్రామం కె.కొత్తవలసకు సైకిల్‌పై వెళుతుండగా లారీ ఢీకొనడంతో తలకు, చేతులకు గాయాలయ్యాయి, విద్యార్థిని స్థానికులు గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక వైద్యం అందించారు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించి, విజయనగరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కొత్తవలస రూరల్: మండలంలోని కర్రిచిన్నయ్యపాలెంలో ఈనెల 8వ తేదీన మరిడిమాంబ తీర్థం నిర్వహించనున్న సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక నాయకుడు గేదెల త్రినాథమూర్తి గురువారం ప్రారంభించారు. టోర్నమెంట్‌లో 32 జట్లు పాల్గొంటున్నాయని, విజేతకు రూ.10,000, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 5,000 నగదు బహుమతి ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కొట్లాటలో ఇద్దరిపై కేసు నమోదు

శృంగవరపుకోట: పట్టణంలో బుధవారం రాత్రి జరిగిన కొట్లాటలో ఇద్దరు యువకులపై కేసు నమోదు చేశామని ఎస్.కోట ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. స్థానిక ఆర్యన్ ఫొటో స్టూడియోలో పనిచేస్తున్న గేదెల జగదీష్ అనే యువకుడిపై బుధవారం రాత్రి 7గంటల సమయంలో ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న నాని అనే యువకుడు, అతని స్నేహితుడు సాయి ఇద్దరూ కలిసి దాడి చేశారని తెలిపారు. తనపై కత్తెరతో దాడి చేసి గాయపరిచారని జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక



విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎల్‌ఐపీ మోనటరింగ్ టీమ్ అధికారి ప్రవీణ్ కుమార్

బొండపల్లి: మండలంలోని నెలివాడ ఉన్నత పాఠశాలను ఎల్‌ఐపీ మోనటరింగ్ బృందం గురువారం సందర్శించింది. పాఠశాలలో సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ప్రతి తరగతిలోనూ విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎల్ఐపీ మోనటరింగ్ టీమ్ జిల్లా అధికారి అరసాడ ప్రవీణ్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్ఎం పి.శారద అధికారుల వెంట ఉన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

వేపాడ: పాటూరు గ్రామంలోని దుర్గా పార్వతి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు బొడ్డపాటి హరిశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేశారు. భక్తులతో సామూహిక కుంకుమార్చన చేయించారు. అనంతరంఅన్నదానం నిర్వహించారు.

ఎస్‌డబ్ల్యూపీసీ సందర్శన

బొండపల్లి: ఒంపల్లి ఎస్‌డబ్ల్యూపీసీని ఎంపీడీఓ ఏ.వేదవతి గురువారం సందర్శించారు. కేంద్రంలో తడి, పొడి చెత్త వేరు చేయడాన్ని పరిశీలించారు. వర్మీ కంపోస్టును తయారుచేసి రైతులకు విక్రయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

నిరసన

కొత్తవలస రూరల్: కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో ఉపాధిహామీ పథకానికి ని ధులు తగ్గించడం అన్యాయం అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.అప్పారావు అన్నా రు. కేంద్ర ప్రభుత్వం తీరుపై ఉత్తరాపల్లిలో ఉపాధి వేతనదారులతో కలిసి గురువారం నిరసన తెలిపారు.

ఏరియా ఆస్పత్రిలో తనిఖీలు



ఆస్పత్రిలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ గౌరీశంకర్

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో డీసీహెచ్‌ఎస్ గౌరీశంకర్ గురువారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, ఆస్పత్రిలో వార్డులను, మందుల నిల్వలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఉద్యోగులు అంతా ఫేస్ రికగ్నైజ్‌డ్ యాప్‌లో మూడు పూటలా హాజరు వేయాలని అన్నారు. రోగులకు అన్నిరకాల వైద్యసేవలు అందించి రిఫరల్ కేసులు తగ్గించాలని సూచించారు. మార్చురీ గది నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు కృషి చేయాలని సంబంధిత డీఈకి సూచించారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు, వైద్యులు అరుణకుమారి, అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించండి



బొండపల్లి: అంగన్‌వాడీ ఆయాకు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: నూతనంగా నియమితులైన అంగన్‌వాడీ సిబ్బంది బాధ్యతగా, వృత్తిపై అంకిత భావంతో పని చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు. మండలంలోని వసాది, పెంటశ్రీరామపురం గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలకు హెల్పర్లు(ఆయాలు)గా నియమితులైన ఇందిర, క్రాంతికుమారిలకు కొఠారుబిల్లి జంక్షన్ వద్ద గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో నియామక ఉత్తర్వులను అందజేశారు. ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, పెంటశ్రీరాంపురం, వసాది సర్పంచ్‌లు బి.సూర్యారావు, కరక మహేష్, ఎంపీటీసీ శ్యామల పాల్గొన్నారు.

బొండపల్లి/ దత్తిరాజేరు: బొండపల్లి మండలంలోని గొట్లాం,దేవుపల్లి, దత్తిరాజేరు మండలంలోని మరడాం–1 అంగన్‌వాడీ కేంద్రాలకు ఆయాలుగా నియమితులైన వారికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య విజయనగరంలోని తన కార్యాలయంలో గురువారం నియామక పత్రాలు అందజేశారు. బొండపల్లి జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, నాయకులు మచ్చిట్టి ఆదినారాయణ,నగిరెడ్ల ఆదినారాయణ పోతల అరుణ్ పాల్గొన్నారు.